సాక్షి
మంచిర్యాల
ఆదివారం । 5 । మే । 2024



ఈత కొలనుల్లో కోలాహలం

వేసవి సెలవులు, పెరిగిన ఎండ తీవ్రతతో సింగరేణి ఈత కొలనులు కిక్కిరిసిపోతున్నాయి. కార్మిక కుటుంబాల సంక్షేమంలో భాగంగా సింగరేణి స్విమ్మింగ్ పూల్‌లు ఏర్పాటు చేసింది. IIలో▸



ఏఐటీయూసీ నిరసన

మందమర్రిరూరల్: ఓసీ కార్మికుల పనివేళలు మార్చాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం కేకే–ఓసీ వద్ద నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు సుదర్శన్, శ్రీనివాస్, ఓదెలు, కుమార్ పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
43.0 /28.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. నైరుతి దిశగా వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు మరింతగా పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు నీట్

మంచిర్యాలఅర్బన్: వైద్య విద్యలో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్–2024 కోసం సర్వం సిద్ధం చేశారు. ఆదివారం నిర్వహించనున్న నీట్ కోసం జిల్లాలో ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. కార్మెల్ సీబీఎస్ఈ(280 మంది విద్యార్థులు), కార్మెల్ హైస్కూల్(312 మంది), ట్రినిటీ హైస్కూల్(360మంది), ఉషోదయ హైస్కూల్(240 మంది), మౌంట్ కార్మెల్(గుడిపేట్)(192 మంది) హైస్కూల్ పరీక్ష కేంద్రాల్లో 1384మంది హాజరుకానున్నారు. మధ్యాహ్నం 2గంటల నుంచి 5.20గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని సిటీ కో–ఆర్డినేటర్ రినేట్ తెలిపారు. ఉదయం 11 గంటలకు నుంచి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తామని పేర్కొన్నారు.

నేడు నిర్మల్‌కు రాహుల్‌గాంధీ రాక

నిర్మల్: పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆదివారం జిల్లా కేంద్రం నిర్మల్‌కు రానున్నారు. పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణ తరఫున ప్రచారం చేయడానికి వస్తున్నారు. నిర్మల్ కలెక్టరేట్ రోడ్డులోని క్రషర్‌గ్రౌండ్‌లో బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 11గంటలకు రాహుల్‌గాంధీ సభాప్రాంగణానికి చేరుకుంటారని కాంగ్రెస్ నేతలు తెలిపారు. ఢిల్లీ నుంచి నాందేడ్‌కు చేరుకుని అక్కడి నుంచి హెలికాప్టర్‌లో నిర్మల్‌కు రానున్నారు. బహిరంగసభ విజయవంతానికి కాంగ్రెస్ శ్రేణులు శ్రమిస్తున్నాయి. దాదాపు 65వేలమంది జనసమీకరణ లక్ష్యంగా పనిచేస్తున్నాయి. ఇన్‌చార్జి మంత్రి సీతక్కతోపాటు డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, ఇటీవల పార్టీలో చేరిన మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, రేఖానాయక్ తదితరులు జనసమీకరణ, సభ విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నారు.

నేడు కాగజ్‌నగర్‌కు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని కాగజ్‌నగర్ పట్టణానికి కేంద్ర హోంశాఖ మంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్‌షా ఆదివారం రానున్నారు. మధ్యాహ్నం 3.20గంటలకు పట్టణంలోని ఎస్పీఎం గ్రౌండ్‌లో బీజేపీ అభ్యర్థి గోడం నగేష్‌కు మద్దతుగా జరిగే ఎన్నికల ప్రచార బహిరంగ సభలో పాల్గొంటారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు సభ ఏర్పాట్లను శనివారం పర్యవేక్షించారు. బహిరంగ సభకు కేంద్ర భద్రత సిబ్బందితోపాటు జిల్లా ఎస్పీ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టారు. కాగజ్‌నగర్ పట్టణంలో ఆదివారం ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

కాంగ్రెస్‌లో మున్సిపల్ కౌన్సిలర్ల చేరిక



రాజలింగుతో ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు పలువురు శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కౌన్సిలర్లు సముద్రాల లావణ్య(17వ వార్డు), నెల్లి శ్రీలత(12వ వార్డు), తడక పద్మావతి(27వ వార్డు), సుకేశిని భరద్వాజ్(30వ వార్డు), గెల్లి రాజలింగు(31వ వార్డు), బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు రవీందర్‌రెడ్డి, నూనె ప్రభాకర్, నెల్లి సమ్మయ్య కాంగ్రెస్ పార్టీలో చేరగా.. ఎమ్మెల్యే గడ్డం వినోద్ కండువా కప్పి ఆహ్వానించారు. కాగా, సదరు కౌన్సిలర్ల చేరికపై కాంగ్రెస్ పార్టీలో కొందరు అభ్యంతరం వ్యక్తం చేయడంతో చేరిక ఆలస్యమైంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య, బి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

డీఏవోగా సురేఖ బాధ్యతల స్వీకరణ



స్వాగతం పలుకుతున్న ఏవో, ఏఈవోలు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా ఇంచార్జీ వ్యవసాయ అధికారిగా బెల్లంపల్లి, మంచిర్యాల సహాయ వ్యవసాయ అధికారి(ఏడీఏ) సురేఖ శనివారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా వ్యవసాయ అధికారి(డీఏవో) కల్పన కొంత కాలంగా సెలవులో ఉన్నారు. గత నెలలో అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నానని, కార్యాలయ, ఎన్నికల విధులకు హాజరు కాలేనని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు సెలవు పత్రం అందజేశారు. దీంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనరేట్ ఆదేశాలతో సురేఖకు ఇంచార్జీ బాధ్యతలు అప్పగించారు. ఇంచార్జీ డీఏవోను ఏవో, ఏఈవోలు, సిబ్బంది శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

కార్మిక క్షేత్రంలో కేసీఆర్ జోష్



జనసంద్రంగా మారిన మంచిర్యాల ఐబీ చౌరస్తా



ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ సీఎం కేసీఆర్

- జనసంద్రంగా ఐబీ చౌరస్తా
- మంచిర్యాలలో రోడ్‌షో

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్మిక క్షేత్రంలో మాజీ సీఎం కేసీఆర్ శనివారం నిర్వహించిన రోడ్డు షో బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపింది. జిల్లా నలుమూలల నుంచి పెద్దయెత్తున తరలివచ్చిన ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలతో పట్టణంలోని ఐబీ చౌరస్తా జనసంద్రంగా మారింది. కేసీఆర్ రాత్రి 8.40గంటలకు మంచిర్యాలకు బస్సులో చేరుకోగా డప్పు వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. బస్సుపై నుంచే కేసీఆర్ తన ప్రసంగాన్ని కొనసాగించారు. ప్రసంగాన్ని ప్రారంభించగానే 'సీఎం.. సీఎం.. సీఎం' అంటూ ప్రజలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కేసీఆర్ ప్రసంగానికి ప్రజల నుంచి పెద్ద ఎత్తున నినాదాలు వస్తుండడంతో, ప్రజలు నిశ్శబ్దంగా ఉండాలంటూ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య బస్సు పైనుంచే కోరారు.

ప్రజల నుంచే సమాధానాలు రాబట్టి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు రెండు లక్షల రుణమాఫీ అయిందా, రైతుబంధు వచ్చిందా, మహిళలకు ప్రతినెలా రూ.2,500 వచ్చాయా అంటూ సమాధానాలు రాబట్టారు. మంచిర్యాలలోని మహిళలకు రూ.5 వేలు వస్తున్నాయంట కదా అంటూ చమత్కరించారు. కల్యాణలక్ష్మి తులం బంగారం వస్తలేదా, కరెంటు పోతుందా, కరెంటు కోతలు మొదలైనాయా అంటూ ప్రజలను అడగడంతో.. అవేమీ వస్తలేవంటూ ప్రజలు చేతులను అడ్డంగా ఊపుతూ సమాధానం ఇచ్చారు. అందరికీ వస్తున్నాయని, కేవలం మంచిర్యాల ప్రజలకే వస్తలేవా అంటూ ప్రజల్లో జోష్ నింపారు.

మొండిగోడలను చూపిస్తూ...

మంచిర్యాలలోని ఐబీ ఆవరణలో గత ప్రభుత్వం హయాంలో ప్రారంభించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాన్ని చూపిస్తూ మధ్యలోనే నిలిచి మొండి గోడలతో కనిపిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ మంచిర్యాల ప్రజలకు వద్దా, ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను తాము ప్రారంభిస్తే కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిర్మాణాన్ని ఆపేసిందని, ఆ భవనం మొండి గోడలే కనిపిస్తున్నాయని అన్నారు.

మీ జిల్లాను రద్దు చేస్తారంటా...

పాత ఆదిలాబాద్, కొత్త మంచిర్యాలలో తాను నిలబడి మాట్లాడుతున్నానని, పాత ఆదిలాబాద్ జిల్లాలోని ప్రజల సౌకర్యం కోసం మూడు కొత్త జిల్లాలను ఏర్పాటు చేసుకుంటే, సీఎం రేవంత్ మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాలను రద్దు చేస్తానని అంటున్నాడని కేసీఆర్ అన్నారు. మంచిర్యాల జిల్లా ఉండాల్నా పోవాల్నా అని ప్రజలను అడగ్గా, ఉండాలని ప్రజలు అనడంతో, ఇది మంచిర్యాల జిల్లా ప్రజల మాటనా అంటూ, మంచిర్యాల జిల్లా ఉండాలంటే కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కోరారు. మంచిర్యాల జిల్లా ఉండాలనుకునే వారు బీఆర్ఎస్‌ను గెలిపించాలని, వద్దనుకుంటే ఓడగొట్టాలని అన్నారు.



మహిళలతో పెద్దపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, సుమన్ కరచాలనం

శ్రీమంతుడికి, కార్మికుడికి పోటీ

పెద్దపల్లి పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తుంది ఆగర్భ శ్రీమంతుడని, బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేస్తుంది భూగర్భ కార్మికుడు అని కేసీఆర్ అభివర్ణించారు. 26 ఏళ్లు సింగరేణిలో తట్టమోసిన కొప్పుల ఈశ్వర్‌కు ఓటు వేస్తారా, పుట్టుకతోనే శ్రీమంతుడైన వ్యక్తికి ఓటు వేస్తారాని ప్రజలను ప్రశ్నించారు. సింగరేణిని ప్రైవేటీకరణ చేసేందుకు కుట్ర పన్నుతున్నారని, సీఎం రేవంత్ ఆదానీని కలిశారని, సింగరేణి ప్రైవేటీకరణ అడ్డుకోవాలన్నా, కార్మికులకు న్యాయం జరగాలన్నా కొప్పుల ఈశ్వర్‌ను ఎంపీగా మంచిర్యాల జిల్లా ప్రజలు గెలిపించుకోవాలని కోరారు. 44, 45 డిగ్రీల ఎండ ఉన్నా మంచిర్యాల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ చౌరస్తా ఈనిండా అనేలా ప్రజలు పెద్ద ఎత్తున వచ్చారని, ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపి ప్రసంగాన్ని 17 నిమిషాల్లో ముగించారు. కేసీఆర్ ప్రసంగాన్ని వినేందుకు ప్రజలు దాదాపుగా మూడు గంటలకు పైగా ఐబీ చౌరస్తాలో వేచి చూశారు. కేసీఆర్ ప్రసంగాన్ని ముగించి బస్సు వెళ్లే వరకు అక్కడే ఉండి తిరిగి ఇళ్లకు వెళ్లారు. కేసీఆర్ ప్రసంగంతో ఒక్కసారిగా బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నెలకొంది. కేసీఆర్ తిరుగు ప్రయాణంలో ఇందారం గోదావరి నది వద్ద పూజలను చేసి వెళ్లారు.



హాజరైన సింగరేణి కార్మికులు, నాయకులు



పథకాలు వస్తలేవంటూ చేతులూపుతున్న జనం

ఓటేసిన ఆర్వో



ఆర్డీవో, రిటర్నింగ్ అధికారి రాములు

మంచిర్యాలఅగ్రికల్చర్: మంచిర్యాల రెవెన్యూ డివిజన్ అధికారి, రిటర్నింగ్ అధికారి(ఆర్వో) రాములు శనివారం తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. మంచిర్యాల ఆర్డీవో కార్యాలయంలో బ్యాలెట్ ద్వారా ఓటు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తెలిపారు.

పార్లమెంటు ఎన్నికలకు సిద్ధం చేయాలి



ఫెసిలిటేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

బెల్లంపల్లి: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. శనివారం పెద్దపల్లి పార్లమెంటు ఎన్నికల ప్రక్రియలో భాగంగా బెల్లంపల్లి బజారు ఏరియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌ను సందర్శించారు. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.రాహుల్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం కమిషనింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఎన్నికల అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అనంతరం బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాన్ని సందర్శించి పోస్టల్ బ్యాలెట్ తీరును పరిశీలించారు. తహసీల్దార్ కేవై ప్రసాద్, ఎన్నికల అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పక్షాల ప్రతినిధులు ఉన్నారు.

'కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి'

జైపూర్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల అభివృద్ధి జరుగుతుందని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. శనివారం మండలంలోని ఇందారం గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉపాధి హామీ కూలీలతో ఆయన మాట్లాడారు. ఈ నెల 13న జరిగే ఎంపీ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం పలు గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలకు కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం దిగదు.. లారీ కదలదు



అందుగులపేట రైస్‌మిల్లు వద్ద ధాన్యం లారీల వరుస

- అన్‌లోడింగ్‌కు మిల్లర్ల కొర్రీలు
- నూకలు వస్తున్నాయంటూ తిరకాసు
- రోజుల తరబడి నిరీక్షణ

మంచిర్యాలఅగ్రికల్చర్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం అన్‌లోడింగ్ కోసం రైస్‌మిల్లుల వద్ద లారీలు వారం రోజులపాటు నిరీక్షించాల్సి వస్తోంది. తాలు, తప్ప, ధాన్యం గింజ విరిగి నూకలు వస్తున్నాయంటూ మిల్లర్లు ధాన్యం దించుకోవడానికి కొర్రీలు పెట్టడంతో జాప్యం జరుగుతోంది. బస్తాకు రెండు నుంచి మూడు కిలోల కోతకు కేంద్రాల నిర్వాహకులు ఒప్పుకుంటేనే దించుకునేందుకు ఒప్పందం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. దీంతోపాటు కొన్ని మిల్లుల్లో గత వానాకాలం సీజన్ ధాన్యం నిల్వ ఉంది. ఇప్పుడు ధాన్యం తీసుకునేందుకు కొర్రీలు పెడుతున్నట్లు తెలుస్తోంది. లోడ్ అయిన లారీలు తిరిగి రాకపోవడం, తూకం వేయకపోవడంతో రైతులు పడిగాపులు గాస్తున్నారు. తరుగు కోసమే తిరకాసు పెడుతున్నారని ఆరోపిస్తున్నారు. పదిహేను రోజులుగా ధాన్యం ఆరబెడుతున్నా తూకం వేసేందుకు తాత్సారం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కేంద్రాల్లో భారీగా ధాన్యం

గత పది రోజులుగా వరి కోతలు వేగవంతం కావడంతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం పోటెత్తుతోంది. ఆరబోసుకునే వీలు లేకుండా కుప్పలుగా పేరుకుపోతోంది. తూకం వేసిన బస్తాలు రైస్‌మిల్లుకు రవాణా కాకపోవడంతో జిల్లా వ్యాప్తంగా సుమారు 15వేల నుంచి 20వేల బస్తాలతో రాశులుగా కనిపిస్తున్నాయి. స్థలం లేకపోవడంతో కాంటా వేయడం నిలిపివేశారు. లక్సెట్టిపేట, హాజీపూర్, జైపూర్, భీమారం, చెన్నూర్, భీమిని, కన్నెపెల్లి తదితర మండలాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. ఉన్నతాధికారులు దృష్టి సారించి ధాన్యం కొనుగోలులో జాప్యం, రవాణాలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కొనుగోలు ధాన్యం లక్ష్యం	1.76 లక్షల మెట్రిక్ టన్నులు
ఇప్పటి వరకు కొనుగోలు	37,813.280 మెట్రిక్ టన్నులు
మొత్తం రైతులు	5,190 మంది
ధాన్యం నగదు మొత్తం	రూ.83,30,26,558
రైతులకు అందింది	రూ.12,20,53,557
మిల్లులకు తరలిన ధాన్యం	31,948.400 మెట్రిక్ టన్నులు
తూకం వేసి కేంద్రంలో ఉన్న ధాన్యం	5,864.880 మెట్రిక్ టన్నులు

నాలుగు రోజులుగా మిల్లు వద్దే



నాలుగు రోజుల క్రితం లక్సెట్టిపేట మండలం రాజంపేట కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం లోడ్ చేసుకుని మందమర్రిలోని రైస్‌మిల్లుకు వచ్చిన. ధాన్యం మంచిగా లేవు, నూకలు వస్తున్నాయని వాపస్ తీసుకు పోవాలని అంటున్నారు. సెంటరోళ్లు మిల్లుకు వచ్చి మాట్లాడిండ్రు. బస్తాకు ఎంతో కొంత కటింగ్‌కు ఒప్పుకుంటే సరే అనే టట్టు ఉంది. నా ముందు లారీలు ఐదు రోజులైతుంది. అన్‌లోడ్ కాక రోజుల తరబడి మిల్లు వద్దనే ఉండాల్సి వస్తుంది. – నగేష్, లారీడ్రైవర్,

మిల్లుకు 30న వచ్చిన..



చెన్నూర్ మండలం నుంచి వడ్లలోడ్‌తో అందుగులపేట రైస్‌మిల్లుకు గత నెల 30న వచ్చిన. అన్‌లోడ్ అవుత లేవు. ఎదురు చూసుడు అవుతుంది. సెంటరోళ్లు, రైతులు ఫోన్ చేస్తుండ్రు లారీ ఎప్పుడు వస్తుందని, అన్‌లోడ్ అయిందా లేదా అని. లోడ్ వేసుకొని రోజుల కొద్దీ ఆగి ఉంటే టైర్లు పాడవుతున్నాయి. ఎప్పుడు అన్‌లోడ్ అవుతుందో ఏమో తెలుస్తలేదు. మిల్లుకాడ ఎండల సచ్చుడు అవుతుంది. – వెంకటేష్, లారీ డ్రైవర్

వడ్లు తెచ్చి 17రోజులైంది..

సెంటర్‌కు వడ్లు తెచ్చి ఇప్పటికి 17 రోజులు అవుతుంది. లారీలు రాక తూకం లేక రోజులు తరబడి కావలా కాస్తూ పడిగాపులు కాయాల్సి వస్తుంది. తాలు తప్ప లేకుండా తేమ శాతం తక్కువ వచ్చేలా ఆరబెట్టుతున్నం. అయినా కాంటా అయిత లేదు. లారీలు వస్తలేవు. ఆలస్యం చేయకుండా అన్‌లోడ్ చేయాలి. – రాజేందర్, హాజీపూర్

కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్
- మండలాల్లో ఎన్నికల ప్రచారం



కొండాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

కాసిపేట/తాండూర్: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పేదలు, అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శనివారం ఆయన కాసిపేట మండలం కొండాపూర్, తాండూర్ మండలం కిష్టంపేట, తాండూర్ గ్రామాల్లో పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌లతో కలిసి ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మాటలు తప్ప చేసిందేమీ లేదని, అభివృద్ధిని పక్కనబెట్టి మత రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. హిందువులు రాముడిని కొలువడం తరాల నుంచి ఉందని, బీజేపీ వచ్చినప్పటి నుంచే రాముడి మీద భక్తి పెరిగినట్లు ఓట్ల రాజకీయం చేస్తున్నారని అన్నారు. కేంద్రంలో రాహుల్‌గాంధీ నాయకత్వంలో ఉపాధి కూలీలకు రోజు రూ.400లతోపాటు మహిళలకు ప్రత్యేక పథకాలు అమలు చేస్తామని చెప్పారు. 100 రోజుల ఉపాధి హామీ పనిని 200 రోజులకు పెంచుతామని అన్నారు. పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని అన్నారు. రాష్ట్రంలో పదేళ్ల పాటు అధికారంలో ఉండి ప్రజలను నిండా ముంచిన బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు ఏం ముఖం పెట్టుకుని ఓట్లడుగుతున్నారని ప్రశ్నించారు. అనంతరం పార్టీలో చేరిన పలువురికి ఎమ్మెల్యే వినోద్ కండువా కప్పి ఆహ్వానించారు. మాజీ ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు, కాంగ్రెస్ నాయకుడు గడ్డం జగన్నాథం, కాసిపేట మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, వంశీధర్‌రావు, రాపర్తి శ్రీనివాస్, నస్పూరి నర్సింగ్, సత్తయ్య, సపాటు శంకర్, బండి ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న రఘునాథ్

దండేపల్లి: మోదీ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. దండేపల్లి మండలం రెబ్బనపల్లి, నెల్కివెంకటాపూర్, దండేపల్లి గ్రామాల్లో శనివారం ఉపాధి హామీ పథకం పని ప్రదేశాలకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు కమలం పువ్వు గుర్తుకు ఓటేసి పెద్దపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. మోదీ ప్రభుత్వం ప్రతి యేటా ఉపాధి కూలీలకు రోజువారీ కూలి పెంచుతూ అండగా నిలుస్తున్నారని అన్నారు. బీజేపీ నాయకులు గోపతి రాజయ్య, మోటపల్కుల గురువయ్య, బత్తుల శేఖర్, గాదె శ్రీనివాస్, గుండ ప్రభాకర్, సురేందర్, వెంకటేష్, అశోక్, రవీందర్, రాకేష్ పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పెద్దపల్లి పార్లమెంట్ బరిలో కాషాయ జెండా ఎగురాలని, ఇందుకు ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి పిలుపునిచ్చారు. శనివారం హాజీపూర్ మండలం వేంపల్లి పద్మావతి గార్డెన్స్‌లో నిర్వహించిన మంచిర్యాల అసెంబ్లీ విస్తృత స్థాయి బూత్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త ఇంటింటికీ వెళ్లి ఓటు వేసేలా చూడాలని కోరారు. సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకుడు గోనె శ్యాంసుందర్‌రావు, ఆదిలాబాద్ జెడ్పీ మాజీ చైర్మన్ సుహాసినీరెడ్డి, నాయకులు ముల్కల్ల మల్లారెడ్డి, జోగుల శ్రీదేవి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జనావాసంలోకి దుప్పి



దుప్పికి చికిత్స చేస్తున్న సిబ్బంది

పెంచికల్‌పేట్: మండలంలోని అగర్‌గూడ అటవీ ప్రాంతం నుంచి శనివారం గ్రామ సమీపంలోకి వచ్చిన చుక్కలదుప్పిని అడవిలో వదిలిపెట్టినట్లు బీట్ అధికారి వెంకటేష్ తెలిపారు. అటవీ ప్రాంతంలో స్థానిక ట్రాకర్‌ల సహాయంతో గస్తీ తిరుగుతున్న సమయంలో అడవి కుక్కల దాడితో దుప్పి బొక్కివాగు సమీపంలోకి పరుగెత్తుకుంటూ వచ్చింది. దీంతో అక్కడే ఉన్న సిబ్బంది సహాయంతో చికిత్స అందించి అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీవో అరుణ్, వాచర్లు సాగర్, లచ్చన్న, వాజీద్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని మూడు గేదెలు మృతి



మృతి చెందిన గేదెలు

ఆసిఫాబాద్‌రూరల్: లారీ ఢీకొని మూడు గేదెలు మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. బూర్గుడ సమీపంలో జాతీయ రహదారిపై గేదెలు రోడ్డు దాటుతుండగా మహారాష్ట్ర నుంచి ఆంధ్రప్రదేశ్ వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో మూడు గేదెలు అక్కడికక్కడే మృతి చెందగా ఒక గేదెకు తీవ్రగాయాలయ్యాయి. గేదెలు చిర్రకుంట గ్రామానికి చెందిన మద్దెల రాజన్నవిగా గుర్తించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



వాంకిడి: పట్టుబడిన బియ్యంతో అధికారులు

వాంకిడి: అక్రమంగా త రలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎన్ఫోర్స్‌మెంట్ డీటీలు రాజ్‌కుమార్, శ్యాంలా ల్ తెలిపారు. మండలానికి చెందిన సోహెల్ 20.10 క్వింటాళ్ల రేషన్ బియ్యం వాహనంలో మహారాష్ట్రకు తరలిస్తుండగా ఆర్లీ ఎక్స్‌రోడ్ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. బియ్యం సీజ్ చేసి ఎమ్ఎల్ఎస్ పాయింట్‌లో అప్పగించి, నిందితుడిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని బూర్గుడలో పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు రాజ్‌కుమార్, శ్యాంలాల్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన పుల్లూరి వెంకటేష్ ఇంట్లో తనిఖీ చేయగా నిల్వ ఉంచిన 3.80 క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నట్లు తెలిపారు. బియ్యం సీజ్‌చేసి నిందితునిపై 6 ఏ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఈత కొలనుల్లో కోలాహలం

- వేసవిలో స్విమ్మింగ్‌కు ఫుల్ క్రేజీ
- కిటకిటలాడుతున్న సింగరేణి కొలనులు
- మహిళలకు ప్రత్యేక శిక్షణ
- సెలవులతో పెరిగిన రద్దీ



సీసీసీలోని స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతున్న దృశ్యం

శ్రీరాంపూర్: వేసవి సెలవులు, పెరిగిన ఎండ తీవ్రతతో సింగరేణి ఈత కొలనులు కిక్కిరిసిపోతున్నాయి. కార్మిక కుటుంబాల సంక్షేమంలో భాగంగా సింగరేణి స్విమ్మింగ్ పూల్‌లు ఏర్పాటు చేసింది. శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి డివిజన్‌లలో డివిజన్ ఒకటి చొప్పున కార్మిక కాలనీల్లో స్విమ్మింగ్ పూల్‌లు ఉన్నాయి. ఏడాదిలో వర్షాకాలం కొద్ది రోజులు మినహా మిగతా రోజులన్నీ తెరిచి ఉంటాయి. సింగరేణిలో అతిపెద్ద ఏరియా శ్రీరాంపూర్ డివిజన్ పరిధిలో సీసీసీ ఆర్కే5 కాలనీ సమీపంలో ఉన్న స్విమ్మింగ్‌పూల్ నిత్యం వందలాది మందితో కిటకిటలాడుతోంది. వేసవి తాపాన్ని తీర్చుకోవడం కోసం కొందరు, సెలవులు ఇవ్వడంతో చాలామంది పిల్లలు ఈత నేర్చుకోవడం కోసం ఇక్కడికి వస్తున్నారు. శ్రీరాంపూర్‌లో ప్రతీరోజు 400 మంది ఈతకు వస్తున్నారు. ఈ స్విమ్మింగ్‌పూల్స్‌లో కంపెనీ ఉద్యోగులతోపాటు ప్రైవేటు వారిని అనుమతిస్తారు. ప్రత్యేక రుసుము చెల్లించి ఎంట్రీపాస్ తీసుకుంటేనే లోనికి అనుమతి ఉంటుంది.

పిల్లలకు ప్రత్యేకం

పెద్దలు, చిన్నపిల్లలకు ప్రత్యేక కొలనులు ఉన్నాయి. ఈత రాని వారిని ప్రత్యేకంగా లోతు తక్కువ నీటిలో ఉంచి ఈత నేర్పిస్తున్నారు. మహిళలకు ప్రత్యేక మహిళా కోచ్‌ను నియమించి నేర్పిస్తున్నారు. నిష్ణాతులైన శిక్షకులతో ఇక్కడ ఈత నేర్పిస్తారు. ఫ్రీస్టైల్, బ్యాక్‌స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్, బటర్‌ఫ్లై వంటి ఈత పద్ధతులు నేర్పిస్తున్నారు. పిల్లలు, పెద్దల కేరింతలతో స్విమ్మింగ్ పూల్స్ కళకళలాడుతున్నాయి.

ఆరోగ్యం కోసం



నేను ఆర్కే 6 గనిలో జనరల్ మజ్దూర్‌గా పని చేస్తున్నాను. నాలుగేళ్లుగా వేసవిలో స్విమ్మింగ్‌కు వస్తున్నాను. అన్ని క్రీడల్లో కంటే ఈత చక్కని క్రీడ. ఈత కొట్టడం వల్ల మంచి ఆరోగ్యం చేకూరుతుంది. బాయి పనిలో పడ్డ అలసట ఈత కొడితే పోతుంది. ఈత కొట్టడం వల్ల శరీరం తేలికగా ఉంటుంది. ఫస్ట్‌షిఫ్ట్ డ్యూటీ ఉంటే సాయంత్రం, రాత్రి షిఫ్ట్, సెకండ్ అయితే ఉదయం సమయంలో ఈతకు వస్తాను.

– తోట మహేశ్, కార్మికుడు

కొంచెం వచ్చింది



నేను ఫస్ట్ క్లాస్ చదువుతున్నాను. స్విమ్మింగ్ పూల్‌కు రోజు డాడీ తీసుకు వస్తున్నారు. ఇప్పటికి కొంచెం కొంచెం ఈత వస్తుంది. ఇక్కడ అందరు ఫ్రెండ్స్ అయ్యారు. సంతోషంగా ఆడుకుంటూ ఈత నేర్చుకుంటున్నా. – బీ.ఈషాగౌడ్, చిన్నారి

మంచిగా నేర్పిస్తున్నారు



నేను థర్డ్ క్లాస్ చదువుతున్నా. ఈత నేర్చుకోవాలని మా టీచర్ చెప్పారు. అందుకే రోజు ఇక్కడికి వచ్చి ఈత నేర్చుకుంటున్నా. మంచిగా నేర్పిస్తున్నారు. ఈ వేసవిలో ఎలాగైన అన్ని స్టైల్స్‌లో ఈత నేర్చుకుంటాను. – లక్ష్మీసహస్ర, చిన్నారి

కాంపిటేషన్‌కు వెళ్తా



చాలా రోజుల నుంచి స్విమ్మింగ్‌పూల్‌కు వచ్చి ఈత నేర్చుకోవాలనుకున్న కూడా స్కూల్ ఉండటం వల్ల సాధ్యం కాలేదు. ఇప్పుడు సెలవులు వచ్చాయి. కొద్ది రోజుల నుంచి ఈతకు వస్తున్నా. ఇప్పటికే చాలా నేర్చుకున్నా. ఇంకా బటర్ ఫ్లై స్ట్రోక్ వంటివి పూర్తిగా నేర్చుకుని స్విమ్మింగ్ కాంపిటేషన్‌లో పాల్గొంటా.

– కే.అభిరాం, విద్యార్థి

రద్దీ పెరిగింది



వేసవి సెలవులు కావడంతో రద్దీ పెరిగింది. గత సంవత్సరం కంటే ఈసారి ఎక్కువ మంది వస్తున్నారు. పిల్లలైతే ఎంతో ఉత్సాహంగా నేర్చుకుంటున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన కొంతమంది పిల్లలు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో కూడా పాల్గొని రాణించారు.

– జీ.బాలకృష్ణ, ట్రైనర్

ధాన్యం లారీలు అన్‌లోడ్ చేసి పంపాలి



రైస్ మిల్లును సందర్శించిన అదనపు కలెక్టర్

మందమర్రిరూరల్: మండలంలోని అందుగులపేటలో ఉన్న వేంకటేశ్వర రైస్‌మిల్లును జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ శనివారం సందర్శించారు. మిల్లుకు వరిధాన్యం లోడుతో వచ్చిన లారీలను వెంటనే అన్‌లోడ్ చేయాలని సూచించారు. తిరిగి కొనుగోలు కేంద్రానికి పంపించాలని మిల్లు నిర్వాహకులను ఆదేశించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



క్రికెట్ పోటీలకు ఎంపికైన భరత్

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన ఇగురపు భరత్ రాష్ట్ర స్థాయి అండర్ –17 క్రికె ట్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ శివ తెలిపా రు. ఈ నెల 6 నుంచి 8 వరకు ఏపీలోని ఒంగోలులో నిర్వహించనున్న పోటీలకు భరత్ ఎంపికయ్యాడు. ఈ పోటీలకు ప్రముఖ సినీనటుడు సుమన్, టీం ఇండియా క్రికెటర్ అంబటి రా యుడు ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. పేద కుటుంబంలో జన్మించిన భరత్ క్రికెట్‌లో అసాధారణ ప్రతిభ చూపుతూ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు అభినందించారు.

క్షణికావేశం.. ఇద్దరు మహిళల ప్రాణం తీసింది!

- భార్యాభర్తల గొడవతో భార్య ఆత్మహత్య
- కారణమని దూషించడంతో మరో మహిళ బలవన్మరణం



గాజిరెడ్డి రమ

సిర్పూర్(టి): క్షణికావేశం ఇద్దరు మహిళల ప్రాణాలు తీసింది. భార్యాభర్తల మధ్య గొడవతో భార్య ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు కారణమంటూ ఆమె భర్త కుటుంబ సభ్యులు దూషించడంతో ఎదురింట్లో ఉండే మహిళ బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండల కేంద్రంలో చోటు చేసుకుంది. సిర్పూర్(టి) ఎస్సై డికొండ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని బెస్తకాలనీకి చెందిన గాజిరెడ్డి రమ(35)ను భర్త గాజిరెడ్డి సురేష్ గత కొంతకాలంగా అనుమానంతో వేధిస్తున్నాడు. ఇదే క్రమంలో శుక్రవారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆవేశంతో రమ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మంచిర్యాలలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం వేకువజామున మృతిచెందింది.

ఆత్మహత్యకు కారణమంటూ..

ఇదే కాలనీలో దోని సరిత(30) రమ ఎదురు ఇంట్లో నివాసం ఉంటుంది. రమ, సరిత ఇళ్లు ఎదురెదురుగా ఉండడంతో పరిచయస్తులు. కాగా, తన భార్య రమకు సరిత మాయమాటలు చెబుతుండడంతోనే రోజు గొడవలు జరుగుతున్నాయని, ఈ గొడవల కారణంగానే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుందని సురేష్, కుటుంబ సభ్యులు సరితను అసభ్యకరంగా దూషించారు. దీంతో మనస్తాపం చెందిన సరిత శనివారం ఉదయం క్షణికావేశంలో వెంట్రుకలకు వేసుకునే కలర్ తాగింది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించింది. వైద్యుల సూచన మేరకు కాగజ్‌నగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయింది.

కేసు నమోదు

గాజిరెడ్డి సురేష్ గత ఏడాది కాలంగా తన కూతురు రమను అనుమానిస్తూ చిత్రహింసలకు గురి చేయడంతోనే ఆత్మహత్యకు పాల్పడిందని ఆమె తల్లి ఒడ్డెటి పోశక్క పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గాజిరెడ్డి సురేష్, ఆయన తల్లి గుండమ్మ, చెల్లె పద్మ అవమానకరంగా దూషించడంతోనే తన భార్య దోని సరిత ఆత్మహత్య చేసుకుందని భర్త దోని రాజేందర్ ఫిర్యాదు చేశారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఓసీపీల్లో పని వేళలు మార్చాలి



వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్: ఎండ తీవ్రత పెరిగినందున ఓపెన్ కాస్ట్ గనుల్లో పని వేళలు మార్చాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీసైదా శనివారం శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే 45 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదవుతోందని, ముమ్ముందు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తోందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఓపెన్ కాస్ట్‌లో ఉద్యోగులు వడగాలులతో అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. సింగరేణి వ్యాప్తంగా అన్ని ఓపెన్ కాస్ట్ గనుల్లో పనివేళలు మార్చకుంటే సోమవారం నుంచి గనులపై అర్ధనగ్న ప్రదర్శనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి ఎం.కొమురయ్య, పిట్ సెక్రెటరీ మోతె లచ్చయ్య, నాయకులు గండి సతీష్, మోహన్‌రెడ్డి, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

కార్మికుల పనివేళలు మార్చాలి



కార్మికులకు నల్లబ్యాడ్జీలు పెడుతున్న నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని యాజమాన్యం మొండి వైఖరి వీడి కార్మికుల పనివేళలు మార్చాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్. తిరుపతి అన్నారు. శనివారం బెల్లంపల్లి ఏరియాలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వేసవి ఎండల తీవ్రంగా మారిందన్నారు. పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటుతున్నాయని, సింగరేణి బొగ్గు గనుల పరిసరాల్లో తీవ్రత మరింత ఎక్కువగా ఉంటోందన్నారు. దాంతో కార్మికులు మండుటెండల్లో విధులు నిర్వహించలేక అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. ఎండల వేడిమికి క్వారీ లో విధులు నిర్వహించటం కార్మికుల ప్రాణాల మీదకు వస్తోందన్నారు. యంత్రాలు సైతం వేడెక్కుతుండటంతో విధులు నిర్వహించలేక అనారోగ్యానికి గురవుతూ విధులకు దూరం అవుతున్నారని అన్నారు. క్వారీలో చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని, కార్మికుల అధిక పనిభారాన్ని వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు చంద్రశేఖర్, పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యవాదులు గౌరవించేలా హైకోర్టు తీర్పు



మాట్లాడుతున్న రాజేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్యవాదులు గౌరవించేలా ఉందని సారంగపూర్ జెడ్పీటీసీ సభ్యుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. 2021 డిసెంబర్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో తన ప్రమేయం లేకుండా తన సంతకం ఫోర్జరీ చేశారని ఆరోపించారు. ఒక వ్యక్తి స్వేచ్ఛను హరించేలా గత ప్రభుత్వ పెద్దలు, అధికారులు కనీస నిబంధనలు పాటించకుండా తన అభ్యర్థిత్వాన్ని విత్ డ్రా చేసుకున్నట్లు ప్రకటించారని పేర్కొన్నారు. అదే సమయంలో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. న్యాయం కోసం దీనిపై హైకోర్టులో పిటిషన్ వేసినట్లు పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థ, ప్రజాస్వామ్యం మీద నమ్మకం ఏర్పడేలా నేడు కోర్టు తీర్పు వెలువడిందని వివరించారు.

కాంగ్రెస్‌లో బీఆర్‌ఎస్ నాయకుల చేరిక



కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

తాండూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు పలువురు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాదారం ఎంపీటీసీ సభ్యుడు సూరం రవీందర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ అధ్యక్షుడు మురళీధర్‌రావు ఆధ్వర్యంలో చేరికలు జరిగాయి. కొత్తపల్లి మాజీ సర్పంచ్ వేల్పుల రాజు, మాజీ ఉపసర్పంచ్ రాజేశం, టీఆర్‌ఎస్ టౌన్ ప్రసిడెంట్ చీకటి వెంకటేశంగౌడ్, నాయకులు మల్లేష్, తిరుపతి, మొండిగౌడ్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అడవి పంది దాడిలో వృద్ధుడు మృతి



మృతుడు బాలయ్య

లక్సెట్టిపేట: మండలంలోని ఎల్లారం గ్రామానికి చెందిన గోర్ల బాలయ్య(64) అడవి పంది దాడిలో మృతిచెందాడు. స్థానిక ఎస్సై చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలయ్య తన బర్రెలను మేపేందుకు రోజు మాదిరిగా గ్రామ శివారులోని వాగు వద్దకు వెళ్లాడు. సమీపంలో ఉన్న అడవి పంది ఒక్కసారిగా దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు సుధాకర్ ఫిర్యా దు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

రెబ్బెన: జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతికిరణ్ ఆదేశాల మేరకు శనివారం రెబ్బెన మండలంలోని ఎన్టీఆర్ కాలనీ, దేవులగూడతో పాటు అనుమానాస్పద ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ దీపక్ తెలిపారు. ఎన్టీఆర్ కాలనీలో 950 లీటర్లు, దేవులగూడలో 850 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఎన్టీఆర్ కాలనీలో నాటుసారా తయారు చేస్తున్న ఇస్లావత్ సుజాత వద్ద 5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రమేశ్‌కుమార్, కానిస్టేబుళ్లు సురేష్, రజిత, ధను, తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన సేవలు



వివరాలు తెలుసుకుంటున్న జీఎం

చింతలమానెపల్లి/కాగజ్‌నగర్‌రూరల్: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలందించేందుకు కృషి చేస్తున్నామని టీఎస్ఎన్‌పీడీసీఎల్ వరంగల్ జనరల్ మేనేజర్ గౌతమ్‌రెడ్డి అన్నారు. శనివారం ఈజ్‌గాంలోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. కౌటాల, దహెగాం, కాగజ్‌నగర్, గన్నారం ఫీడర్లలో ఇబ్బందులు, లోడ్ సంబంధించిన వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరాలో సమస్యలు రాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సేవలందిస్తున్న సిబ్బందిని అభినందించారు. ఆయన వెంట డీఈ నాగరాజు, రూరల్ అసిస్టెంట్ ఇంజనీర్ జగన్‌మోహన్, సిబ్బంది ఉన్నారు.

వడదెబ్బతో మహిళ మృతి

రెబ్బెన(ఆసిఫాబాద్): మండల కేంద్రానికి చెందిన అజీజబేగం (48) శనివారం వడదెబ్బతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకా రం ఇళ్లలో పనులు చేసుకుంటూ జీవనం సాగించే మహిళ రోజు మాదిరిగానే శుక్రవారం పనులు ము గించుకుని మధ్యాహ్నం ఇంటికి వచ్చింది. కాసేపటికి వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లి చికిత్స అందించారు. శనివారం మరోసారి పీహెచ్‌సీకి తీసుకెళ్లి చికిత్స అందించినప్పటికీ సాయంత్రం మృతి చెందింది.

విధి నిర్వహణలో భద్రత సూత్రాలు పాటించాలి

వాంకిడి: విద్యుత్ శాఖ సిబ్బంది విధి నిర్వహణలో భద్రత సూత్రాలు పాటించాలని వి ద్యుత్ శాఖ ఎస్ఈ వాసుదేవ్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని 33/11 కేవి విద్యుత్ ఉప కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. తగు జాగ్రత్తలు పాటిస్తూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించాలన్నారు. భద్రత నియమాలతో ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు.

వర్క్‌షాప్‌లో సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం సమర్పిస్తున్న హెచ్‌ఎంఎస్ నాయకులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్‌లో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని హెచ్ఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య ఆధ్వర్యంలో నాయకులు డీజీఎం రవీందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వర్క్‌షాప్‌లో ఉద్యోగులు మధ్యాహ్న భోజనం చేసే సమయంలో క్యాంటీన్ తెరిచి ఉంచాలని పేర్కొన్నారు. స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, మహిళా కార్మికులకు వాష్‌రూమ్‌లలో నీరు సరఫరా లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వేసవి ఎండల దృష్ట్యా ఉద్యోగులకు ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేయాలని, పనివేళలు మార్చాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీఐ జిల్లా కార్యకర్తల సమావేశం



మాట్లాడుతున్న లక్ష్మణ్

బెల్లంపల్లి: మంచిర్యాలలో ఆదివారం సీపీఐ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ తెలిపారు. శనివారం బెల్లంపల్లి సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గాల కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు సీపీఐ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆడేపు రాజమౌళి, అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర సమితి సభ్యులు బొల్లంపూర్ణిమ, ఎం.వెంకటస్వామి, సీనియర్ నాయకులు చిప్ప నర్సయ్య, డీఆర్.శ్రీధర్, కొంకుల రాజేష్, రత్నం రాజం, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.